క్లుప్తంగా

7న మెగా పేరెంట్, టీచర్ల సమావేశం


పొదిలిలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

పొదిలి రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల ఏడో తేదీన మెగా పేరెంట్, టీచర్ల సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జి.శోభన్‌బాబు తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన హెచ్‌ఎంల సమావేశంలో ఆయన మాట్లాడారు. పిల్లల భవిష్యత్ కోసం తల్లిదండ్రుల సహకారం, పరీక్షల ప్రోగ్రెస్ గురించి తెలియజేయడంతోపాటు ఆరోగ్య సంబంధిత కార్డులు అందజేయాలని సూచించారు. సమావేశంలో ఎంఈఓ ఎం.శ్రీనివాసరెడ్డి, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీతో మానసిక పరిపక్వత

కంభం: దివ్యాంగ చిన్నారులకు రోజూ ఫిజియోథెరపీ చేయడం ద్వారా వారిలో శారీరక వృద్ధితోపాటు మానసిక పరిపక్వత సాధించవచ్చని ఎంఈఓ టి.శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక భవిత కేంద్రంలో బుధవారం నిర్వహించిన ఫిజియోథెరపీ శిబిరాన్ని పరిశీలించారు. ప్రతి బుధవారం చిన్నారులకు ఫిజియోథెరపీ చేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ బి.సంధ్యారాణి, సిబ్బంది ఈశ్వరి, అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్పస్వామి విళక్కి

గిద్దలూరు రూరల్: పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం రాత్రి అయ్యప్పస్వామి విళక్కి మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సుప్రభాతసేవ, నగర సంకీర్తన, గణపతిపూజ, కలశస్థాపన, మండపారాధన, పడిపూజ, స్వామివారి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప మాలాధారులతోపాటు సకల దీక్షాస్వాములు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఎంఈఓ తనిఖీ


రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంఈఓ

కొనకనమిట్ల: మండలంలోని గార్లదిన్నె ఏపీ పాఠశాల, కె.నాగంపల్లి హిందూ ప్రాథమిక పాఠశాలను బుధవారం ఎంఈఓ–2 బి.నరసింహరావు తనిఖీ చేశారు. పాఠశాలల్లో రికార్డులు పరిశీలించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. మధ్యాహ్న భోజనం నాణ్యంగా తయారు చేయాలని స్పష్టం చేశారు. సీఆర్పీ కిరణ్ పాల్గొన్నారు.

350 హెక్టార్లలో పంట నష్టం

కొమరోలు: మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల పంట నష్టం సంభవించింది. సుమారు 350 హెక్టార్లలో పంటలు నీట మునిగి నష్టం వాటిల్లిందని మండల వ్యవసాయశాఖ అధికారి కె.రాజశ్రీ తెలిపారు. శనగ 330 హెక్టార్లలో, వరి 20 హెక్టార్లలో నష్టపోయినట్లు గుర్తించామని వివరించారు. కాగా బుధవారం కూడా మండలంలో వర్షం కురవడంతో శనగ, వరి, మిరప, పత్తి తదితర పంటల్లో భారీగా నీరు నిలిచింది. బాదినేనిపల్లె వద్ద పులివాగు ప్రవహిస్తుండడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

నిలువ నీడ లేదు!

● మార్కాపురం పట్టణంలో బస్‌షెల్టర్లు లేక ప్రయాణికుల ఇక్కట్లు


కంభం బస్టాండ్‌లో వేచి ఉన్న ప్రయాణికులు

మార్కాపురం:

డివిజన్ కేంద్రమైన మార్కాపురం పట్టణంలో బస్‌షెల్టర్లు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికుల అవస్థలు చెప్పనలవికావు. నీడ కోసం షాపుల్లో, టీ బంకుల వద్ద తలదాచుకుంటున్నారు. ముఖ్యంగా ఆర్టీసీ బస్సులు నిలిపే దోర్నాల సెంటర్, కంభం సెంటర్, కోర్టు సెంటర్‌లో బస్‌షెల్టర్లు లేవు. దీంతో వేసవి కాలంలో ఎండకు, వర్షాకాలంలో వానకు తడుస్తూ ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మార్కాపురం డిపోలో 97 బస్సులు ప్రయాణికులను వివిధ ప్రాంతాలకు ప్రతి రోజూ చేరవేస్తుంటాయి. కంభం సెంటర్‌లో కంభం, నంద్యాల, కడప, ప్రొద్దుటూరు, గిద్దలూరు వెళ్లే దూరప్రాంత ప్రయాణికులతో పాటు చింతగుంట్ల, జంగంగుంట్ల, జమ్మనపల్లె, గొట్టిపడియ, కోలభీమునిపాడు వెళ్లే ప్రయాణికులు ఈ సెంటర్‌లో ఆగుతారు. దోర్నాల సెంటర్‌లో త్రిపురాంతకం, వినుకొండ, నరసరావుపేట, గుంటూరు, విజయవాడ, విశాఖపట్నం, యర్రగొండపాలెం, మాచర్ల, హైదరాబాద్, దోర్నాల, శ్రీశైలం, పెద్దారవీడు, కర్నూలు, ఆత్మకూరు వెళ్లే ప్రయాణికులతోపాటు దగ్గర గ్రామాలైన దేవరాజుగట్టు, గొబ్బూరు, తోకపల్లె గ్రామాల ప్రయాణికులు బస్సుల కోసం వేచి ఉంటారు. కోర్టు సెంటర్‌లో ఒంగోలు, తిరుపతి వెళ్లే ప్రయాణికులతో పాటు కలుజువ్వలపాడు, కొనకనమిట్ల, పొదిలి, రైల్వేస్టేషన్, గజ్జలకొండ తదితర గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు ఉంటారు. ఈ ప్రాంతాల్లో ఆర్టీసీ అధికారులు బస్‌షెల్టర్ల నిర్మాణంపై దృష్టి సారించకపోవటంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, చిన్న పిల్లలు ఎండ వేడిమికి తట్టుకోలేక దగ్గరలో ఉన్న షాపుల పంచన ఆశ్రయం పొందాల్సి వస్తోంది. షాపుల యజమానులు తమ వ్యాపారం దెబ్బతింటుందని చీదరించుకుంటుండటంతో అటు నీడ లేక, ఇటు ఎండలో ఉండలేక ప్రయాణికులు నిస్సహాయత వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు, దాతల సహకారంతో బస్‌షెల్టర్లను నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.


దోర్నాల సెంటర్‌లో ప్రయాణికులు

బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలి



మార్కాపురం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో బస్‌షెల్టర్లు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఒంగోలు వెళ్లే ప్రయాణికులు కోర్టు సెంటరులో కంభం, గిద్దలూరు, నంద్యాల వెళ్లే ప్రయాణికులు కంభం సెంటరులో, వినుకొండ, యర్రగొండపాలెం, పెద్దారవీడు, దోర్నాల, శ్రీశైలం వెళ్లే ప్రయాణికులు దోర్నాల బస్టాండ్ సెంటరులో రోడ్డుపైనే వేచి ఉంటున్నారు. ప్రభుత్వం స్పందించి బస్‌షెల్టర్లు ఏర్పాటుచేయాలి.

– గాలి వెంకటరామిరెడ్డి, మార్కాపురం

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


కంభం : విద్యార్థులకు సూచనలిస్తున్న ఎస్సై


కొమరోలు : మాట్లాడుతున్న ఎస్సై వెంకటేశ్వర్లు నాయక్

కంభం: గ్రామీణ ప్రాంతాల ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని కంభం ఎస్సై బి. నరసింహారావు సూచించారు. మండలంలోని జంగంగుంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు చిన్న వయసులోనే మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా బాగా చదువుకొని ప్రయోజకులు కావాలని ఆకాంక్షించారు. ఆడపిల్లలను మగపిల్లలతో సమానంగా చదివించాలని తల్లిదండ్రులకు సూచించారు.

బేస్తవారిపేట: మండలంలోని పూసలపాడు హైస్కూల్ విద్యార్థులకు బుధవారం సైబర్ నేరాలపై పోలీసులు అవగాహన కల్పించారు. ఎస్సై రవీంద్రారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో నడుచుకోవాలని, మత్తు పదార్థాల జోలికి వెళ్తే బంగారు భవిష్యత్ నాశనమవుతుందని పేర్కొన్నారు. చదువులో రాణిస్తే మంచి భవిష్యత్ సొంతం చేసుకోవచ్చన్నారు.

సోషల్ మీడియాలో అప్రమత్తంగా ఉండాలి

కొమరోలు: సోషల్ మీడియా వినియోగంలో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై వెంకటేశ్వర్లునాయక్ సూచించారు. మండలంలోని తాటిచెర్ల మోటు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైబర్ నేరాలపై బుధవారం అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ.. గుర్తు తెలియని మొబైల్ నంబర్ల నుంచి వచ్చే లింకులను షేర్ చేయవద్దని సూచించారు. బాల్యవివాహాలు చేయడం నేరమని, అలాంటి సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియజేయాలని సూచించారు.

ఆర్టీసీ డిపోకు సిమెంట్ బల్లలు అందజేత


ఆర్టీసీ డీఎంకు సిమెంటు బల్లలు అందిస్తున్న రీడింగ్ రూమ్ ప్రతినిధులు

మార్కాపురం: పట్టణంలోని దోర్నాల సెంటరులో ప్రయాణికులు కూర్చునేందుకు వీలుగా ఎస్‌సీవీకే నిలయం, రీడింగ్ రూమ్ వెల్ఫేర్ సొసైటీ తరఫునన 4 సిమెంటు బల్లలను బుధవారం సాయంత్రం కమిటీ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ బాల సుబ్బారావు, గుంటక సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షుడు శాసనాల వీరబ్రహ్మం ఆధ్వర్యంలో ఆర్టీసీ డిపో మేనేజర్ ఏఎస్ నరసింహులుకు అందించారు. కార్యక్రమంలో కోశాధికారి పి.మల్లికార్జునరావు, సహాయ కార్యదర్శి ఎం.మోహన్‌రెడ్డి, సభ్యులు గుంటక వెంకటరెడ్డి, ఆర్‌కేజే నరసింహం, యక్కలి రమేష్, హుస్సేన్‌ఖాన్, ఎంవీ కృష్ణారావు, ఎం.మల్లికార్జునరావు, శ్రీనివాసమూర్తి, రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుంటక సుబ్బారెడ్డి, వెన్న వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గిఫ్టు బాక్సుల ఏర్పాటు

మార్కాపురం నుంచి గుండంచర్ల వెళ్లే రూటులో ఆర్టీసీ బస్సుల్లో గిఫ్టు బాక్సులు ఏర్పాటు చేశామని, ప్రయాణం చేసేవారికి గిఫ్టులు అందించేందుకు కూపన్లు ఇస్తున్నామని, ఈ అవకాశాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలని డిపో మేనేజర్ సూచించారు. ప్రయాణికులు ఆటోల్లో కాకుండా ఆర్టీసీ బస్సుల్లో ఎక్కాలని కోరారు. టికెట్ వెనుక సెల్ నంబర్ రాసి గిఫ్టు బాక్సుల్లో వేయాలని సూచించారు.

అసంబద్ధ నిర్ణయాలు మానుకోవాలి


ఎంఈఓ రాందాస్‌నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

మార్కాపురం టౌన్: విద్యాశాఖ అసంబద్ధ నిర్ణయాలు మానుకోవాలని యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఎంఈవో రాందాస్‌నాయక్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. యూటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ.. అపార్ కార్డుల కష్టాలను ఎవరికీ చెప్పుకోలేక పోతున్నామన్నారు. రోజుకు స్కూల్లో పది శాతం కంటే తక్కువ మంది మాత్రమే సెలవు పెట్టాలనే నిబంధన విధించడం సరికాదన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఓవీ వీరారెడ్డి, జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు, నాయకులు జమరామిరెడ్డి, రాజేష్, కె.వెంకటేశ్వరరెడ్డి, వెంకటేశ్వర్లు, అల్లూరిరెడ్డి, రమాదేవి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హిందువులకు రక్షణ కల్పించాలి

● సబ్‌కలెక్టర్‌కు వినతి


సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న వివిధ సంఘాల నాయకులు

మార్కాపురం: బంగ్లాదేశ్‌లో హిందువులకు రక్షణ కల్పించాలని కోరుతూ విశ్వహిందూ పరిషత్ జిల్లా గౌరవాధ్యక్షుడు గోపాలుని హరిహరరావు, అధ్యక్షుడు ఇమ్మడిశెట్టి చిన్నవీరారావు కోరారు. బుధవారం హిందువులపై దాడులను నిరసిస్తూ స్థానిక శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి దేవస్థానం నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన నిర్వహించి సబ్ కలెక్టర్ త్రివినాగ్‌కు వినతిపత్రం అందించారు. బంగ్లాదేశ్‌లో హిందూ దేవాలయాలు, దుకాణాలు, కుటుంబాలపైన ముస్లింలు దాడి చేయడంపై ఆందోళన వ్యక్తంచేశారు. బంగ్లాదేశ్‌లో హిందువులకు రక్షణ కల్పించే విధంగా భారత ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలిపారు. భారత్‌లో మైనార్టీలకు హక్కులు, రక్షణ కల్పిస్తుంటే బంగ్లాదేశ్‌లో మైనార్టీలైన హిందువులపై దాడులు చేయడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు వై.కోటేశ్వరరావు, నరాల వెంకటరెడ్డి, బీజేపీ నాయకులు పీవీ కృష్ణారావు, చంద్రశేఖర్, ఇస్కాన్ ప్రతినిధులు జి.దశరథరామిరెడ్డి, కిశోర్, హిందూ సంఘాల ప్రతినిధులు నారాయణాచార్యులు, అశోక్, మేడా ప్రసాద్, రామకృష్ణ, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఈవ్‌టీజింగ్ చేస్తే కఠిన చర్యలు

● సీఐ సుబ్బారావు హెచ్చరిక


మాట్లాడుతున్న సీఐ సుబ్బారావు, పక్కన ఎస్సైలు

మార్కాపురం: మహిళలు, అమ్మాయిలను వేధించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మార్కాపురం సీఐ సుబ్బారావు హెచ్చరించారు. బుధవారం డాక్టర్ శామ్యూల్ జార్జి ఫార్మసి కళాశాలలో ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళలపై గౌరవం చూపాలని, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, లైసెన్సు లేకుండా వాహనాలు నడపవద్దని చెప్పారు. బాల్య వివాహాలను నివారిద్దామని, అందుకు అందరం సమన్వయంతో పనిచేద్దామన్నారు. పట్టణ ఎస్సై సైదుబాబు మాట్లాడుతూ సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, ఆన్‌లైన్ లావాదేవీల విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. టూటౌన్ ఎస్సై డాక్టర్ ఎ.రాజమోహన్ మాట్లాడుతూ రహదారి భద్రతా నియమాలు పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చని అన్నారు. వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ వాడాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రాజా జయరావు, ప్రొఫెసర్లు సునీత, అశోక్‌బాబు, శ్రీకాంత్, భాస్కర్, సయ్యద్ ముజీబ్, కృపాల్, రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖ అసంబద్ధ నిర్ణయాలు సరికాదు

● ఏపీటీఎఫ్ నాయకుల ఆందోళన


ఎంఈఓకు వినతి పత్రం ఇస్తున్న యూనియన్ నాయకులు

కంభం: విద్యాశాఖాధికారుల అసంబద్ధ నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని నిరసన ప్రదర్శనలు చేపట్టనున్నట్లు ఏపీటీఎఫ్ అధ్యక్షుడు షేక్ ఖాసింపీరా, ప్రధాన కార్యదర్శి కె.సునీల్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం స్థానికం ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈఓ మాల్యాద్రికి కార్యాచరణతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. పాఠశాలల పనివేళల పెంపు, పది శాతానికి మించి ఉపాధ్యాయులు సెలవు పెట్టరాదనే ఆంక్షలు, పదో తరగతి పరీక్షలకు సంసిద్ధత పేరుతో విడుదల చేసిన వంద రోజుల యాక్షన్ ప్లాన్, అపార్ నమోదు, ఇలా ప్రతి నిర్ణయం అసంబద్ధంగానే ఉన్నాయన్నారు. ఇవి ఉపాధ్యాయులను తీవ్ర ఆందోళనకు, మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నాయన్నారు. విద్యాశాఖ అసంబద్ధ నిర్ణయాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు చేపట్టాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఈ నెల 11న జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట, 16న రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శనలు చేపడతామని చెప్పారు.

రేషన్ బియ్యాన్ని అమ్మితే కార్డు తొలగిస్తాం

● మార్కాపురం తహసీల్దార్ చిరంజీవి


మాట్లాడుతున్న తహసీల్దార్ చిరంజీవి

మార్కాపురం రూరల్: రేషన్ బియ్యాన్ని అమ్మినట్లయితే వారి రేషన్‌కార్డులు తొలగిస్తామని మార్కాపురం తహసీల్దార్ చిరంజీవి హెచ్చరించారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. రేషన్ బియ్యాన్ని ఎవరైనా అమ్మినట్లు మా దృష్టికి వస్తే విచారణ అనంతరం కార్డులు తొలగిస్తామని స్పష్టం చేశారు. పశ్చిమ ప్రాంతంలో రేషన్ దందా యథేచ్ఛగా సాగుతోందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం నీటి సంఘాల ఎన్నికలు వాయిదా వేసిందదని, ఎన్నికల తేదీని త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు. ఈనెల 6 నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లోనూ సదస్సులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. భూ సమస్యలపై విచారణ చేపట్టి వేగంగా పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. మండలంలో 4 వేల మంది యువత ఓటు హక్కు నమోదు చేసుకోవాలని సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో సుమారు 700 ఎకరాల ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అయినట్లు గుర్తించామని, ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. సమావేశంలో డీటీ బి.శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

హైవే వెంట వ్యర్థాల తొలగింపు


చెత్తను తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులు

బేస్తవారిపేట: అనంతపురం–అమరావతి హైవే వెంట చెత్త, వ్యర్థాలు పడేస్తున్న వైనంపై బుధవారం 'డంపింగ్ హైవే' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. చెత్త డంప్ చేస్తున్న ప్రదేశాన్ని పంచాయతీ కార్యదర్శి భాస్కర్‌రెడ్డి పరిశీలించారు. పారిశుధ్య సిబ్బందితో హైవే వెంట వ్యర్థాలను తొలగించారు.

సాక్షి ఎఫెక్ట్..


ప్రమాదకరంగా ఉన్న పైకప్పు


వర్షానికి గదుల్లో నీరు రావడంతో కుర్చీలు మరోవైపు వేసుకున్న సిబ్బంది

శిథిలావస్థలో తహసీల్దార్ కార్యాలయం

- చిన్నపాటి వర్షానికే జలమయం
- పెచ్చులూడుతూ ప్రమాదకరంగా ఉన్న పైకప్పు
- దినదినగండంగా విధులు నిర్వహిస్తున్న సిబ్బంది


నిరుపయోగంగా వదిలేసిన కంప్యూటర్ గది


తహసీల్దార్ కార్యాలయం

కంభం: చిన్నపాటి వర్షం కురిసినా కంభం తహసీల్దార్ కార్యాలయం గోడలు ఉరుస్తున్నాయి. పైకప్పు నుంచి నీటి ధారలు పడుతుండటంతో కార్యాలయ గదులు జలమయమైపోతున్నాయి. ఇప్పటికే కంప్యూటర్ గదిలో శ్లాబ్ పెచ్చులూడి ప్రమాదకరంగా ఉండటంతో మరో గదిలోకి మారారు. ఆ గదికి తాళం వేసేశారు. వీఆర్వోలు కూర్చునే గదితోపాటు సర్వేయర్ రూమ్‌లోనూ అదే పరిస్థితి. దీంతో కార్యాలయ సిబ్బందితో పాటు ప్రజలు కూడా ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆందోళనకు గురవుతున్నారు. పైకప్పులు పెచ్చులూడి పడుతుండటంతో సిబ్బంది భయపడుతూ దినదినగండంగా విధులు నిర్వహిస్తున్నారు. కార్యాలయం బయట కూడా వర్షం నీరు నిలిచిపోతోంది. ఉన్నతాధికారులు స్పందించి తహసీల్దార్ కార్యాలయానికి మరమ్మతులు చేయించాలని ప్రజలతోపాటు సిబ్బంది సైతం విజ్ఞప్తి చేస్తున్నారు.

ఘనంగా మాజీ గవర్నర్ రోశయ్య వర్ధంతి


రోశయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ కృష్ణ తదితరులు

మార్కాపురం టౌన్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు రాష్ట్ర మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య వర్ధంతిని బుధవారం స్థానిక ఆర్యవైశ్య నాయకులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని కన్యకా పరమేశ్వరి ఆలయ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, ఆలయ కమిటీ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆర్థిక మంత్రిగా, సీఎంగా రోశయ్య చేసిన సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ కార్యదర్శి సూరె సుబ్బారావు, వాసవి వృద్ధాశ్రమం అధ్యక్షుడు జి.కృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.